

కాంట్రాక్టు నర్సులను రెగ్యులర్ చేయాలని ధర్నా


ధర్నా చేస్తున్న వైద్య సిబ్బంది

పోలవరం :కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న ఎఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని గురువారం పోలవరం ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్ర ఎఎన్‌ఎంలు, వైద్య సిబ్బంది ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా స్టాఫ్ నర్సులు శిరీష మాలతి, తులసి, రమాదేవి, శాంతి, సత్యశ్రీ మాట్లాడుతూ జిఒ 115 ద్వారా ఇటీవల వచ్చిన ఎఎన్‌ఎంలకు జిఎన్‌ఎం శిక్షణ ఇచ్చి ప్రమోషన్లు ఇస్తున్నారని, తమను మాత్రం నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు కూడా శిక్షణ ఇచ్చి ప్రమోషన్లు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్లు రాజు, సిబ్బంది శివ, తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్.. ఇక సెలవు



సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణంతో తీవ్ర దిగ్భ్రాంతి

జిల్లాతో అనుబంధం గుర్తు చేసుకుని తల్లడిల్లిన కమ్యూనిస్టు శ్రేణులు

పలుచోట్ల సంతాప సభలు, పాల్గొన్న వివిధ పార్టీల నేతలు

ప్రజాశక్తి - పశ్చిమ డెస్క్

సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం జిల్లాలోని కమ్యూనిస్టు శ్రేణులను, అభ్యుదయవాదులను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. ఈ సందర్భంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాతో, జిల్లావాసులతో ఉన్న సంబంధాన్ని నేతలు, కార్యకర్తలు గుర్తు చేసుకున్నారు. ఏచూరి విద్యార్థి నేతగా ఉన్నప్పుడే ఆయనకు జిల్లాతో అనుబంధం ఉంది. ఆయన ఎస్‌ఎఫ్‌ఐ ఆలిండియా అధ్యక్షునిగా 1985లో పశ్చిమగోదావరి జిల్లా భీమవరం పట్టణంలో జరిగిన ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభకు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఆ సందర్భంగా అక్కడి పాత బస్టాండ్ వద్ద ఉన్న అల్లూరి సీతారామరాజు స్మారక ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో సీతారాం ఏచూరి ప్రసంగించారు.

1994లో జరిగిన సాధారణ ఎన్నికల్లో ఆచంట నియోజకవర్గం నుంచి బరిలో నిలిచిన సిపిఎం అభ్యర్థి దిగుపాటి రాజగోపాల్ విజయాన్ని కాంక్షిస్తూ ఆచంటలో నిర్వహించిన సభలో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యుని హోదాలో ఏచూరి పాల్గొని ప్రసంగించారు.

2018 ఫిబ్రవరిలో జరిగిన సిపిఎం రాష్ట్ర మహాసభలో సీతారాం ఏచూరి మూడు రోజులపాటు ప్రత్యక్షంగా పాల్గొన్నారు.

ఏచూరి మృతి పట్ల జిల్లాలోని సిపిఎం నేతలు, కార్యకర్తలతోపాటు వామపక్ష నేతలు, కార్యకర్తలు తీవ్ర సంతాపం తెలిపారు. వివిధ పార్టీల నేతలు సైతం రాజ్యసభలో ఏచూరి ప్రసంగాలను, వివిధ అంశాలపై ఆయన విశ్లేషణలను గుర్తు చేసుకుని మంచి నేతను కోల్పోయామని పేర్కొన్నారు.


ఇప్పటికే ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సీనియర్ నేత మాజీ ఎంఎల్ఎ రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్ఎస్), ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాత, రైతునేత వలవల శ్రీరామ్మూర్తి వరుస మరణాలతో తీరని లోటుగా తల్లడిల్లుతున్న సందర్భంలోనే నరసాపురంలో సిపిఎంలో, సిఐటియులో క్రియాశీల నేతగా ఉన్న పొన్నాడ రాము (బాబాయ్) ఆకస్మిక మృతి అందరినీ నివ్వెరపర్చింది. ఇదే సమయంలో జిల్లాతో అనుబంధం, అందరికీ ఆత్మీయ నేతగా ఉన్న సీతారాం ఏచూరి మరణం కమ్యూనిస్టు శ్రేణులను తీవ్ర వేదనకు గురిచేసింది.



భీమవరంలో సిపిఎం రాష్ట్ర మహాసభ సందర్భంగా అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీతారాం ఏచూరి (ఫైల్‌ఫొటో)


భీమవరంలో ఏచూరి, ప్రకాష్‌కరత్‌కు త్రిపుర సంఘీభావ నిధి అందిస్తున్న సిపిఎం ఉమ్మడి పశ్చిమగోదావరి నేతలు (ఫైల్‌ఫొటో)


భీమవరం వచ్చిన సందర్భంగా లౌకికతత్వ పరిరక్షకుకు విశేష కృషి చేస్తున్నారంటూ సీతారాం ఏచూరిని సత్కరించిన ముస్లిం నేతలు (ఫైల్‌ఫొటో)


సిపిఎం సీనియర్ నేత ఆర్‌ఎస్‌కు సీతారాం ఏచూరి ఆత్మీయ పలకరింపు (ఫైల్‌ఫొటో)

గోదావరి తగ్గుముఖం


ముంపులో ఉన్న పంట పొలాలు

ప్రజాశక్తి - కుక్కునూరు

మూడు రోజులుగా బెంబేలెత్తించిన వరద గోదావరి తగ్గుముఖం పట్టింది. దీంతో విలీన మండలాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అయితే కుక్కునూరు మండలంలో గోదావరి ముంపు ఇంకా తగ్గలేదు. దీంతో కుక్కునూరు-దాచారం, ఇంజరం-ముత్యాలంపాడు మధ్య ఉన్న కాజ్‌వేలు ముంపులోనే ఉన్నాయి. దీంతో 15 గిరిజన గ్రామాలకు రాకపోకలు పునరుద్ధరణ కాలేదు. దీంతో ఆయా గ్రామా ప్రజలు, విద్యార్థులు, రైతులు, వ్యాపారులు మండల కేంద్రానికి రావాలంటే చుట్టుతిరిగి 15 కిలోమీటర్లు తిరిగి రావాల్సి వస్తుంది. మొక్కదశలో ఉన్న మిర్చి పంట ముంపుబారిన పడటంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది.

పోలవరం: పోలవరం వద్ద గోదావరి నీటిమట్టం గురువారం నాటికి తగ్గుముఖం పట్టింది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వేలోకి వస్తున్న 11,66,581 క్యూసెక్కుల వరద జలాలను అధికారులు దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 33.410 మీటర్లు, స్పిల్‌వే దిగువన 25.310 మీటర్ల నీటిమట్టం నమోదైనట్లు ఇఇ మల్లికార్జునరావు తెలిపారు.

తగ్గుతున్న కొల్లేరు వరద

లంక గ్రామాలను వీడని ముంపు

ఏలూరు-కైకలూరు, ఇతర మార్గాల్లో పునరుద్దరణ కాని రాకపోకలు


రహదారిపై వరద నీరు

ప్రజాశక్తి - దెందులూరు

కొల్లేరు వరద తగ్గుముఖం పట్టింది. ప్రధానంగా బుడమేరు ఉగ్రరూపంతో ముంపు బారిన పడిన కొల్లేరు లంక గ్రామాల్లో వరద తగ్గుతోంది. రెండు రోజుల క్రితం వరకు 3.50 అడుగులకుపైగా నమోదైన కొల్లేరు నీటిమట్టం గురువారం నాటికి మూడు అడుగుల దిగువకు చేరింది. దీంతో గ్రామాల్లోని వీధుల్లోకి చేరిన నీరు వెనక్కి లాగుతోంది. వర్షాలు తగ్గినా ఎగువ నుంచి డ్రెయిన్లు, తమ్మిలేరు, బుడమేరు ద్వారా కొల్లేరులోకి నీరు పెద్దఎత్తున రావడంతో వరద ఉధృతి గురువారం వరకూ కొనసాగింది.

రహదారులపై వరదనీరు, బురద

వరదలతో లంక గ్రామాల్లోకి నీరు చేరగా వేలాది ఎకరాల్లో చేపల చెరువులు ముంపు బారినపడ్డాయి. ఏలూరు మండలంలోని గుడివాకలంక, మొండికోడు రహదారులు, ఏలూరు-కైకలూరు రహదారి, పెదపాడు మండలంలోని సత్యవోలు-కొణికి, వసంతవాడ, ఏలూరు-గుడివాడ రహదారులు ముంపులోనే ఉన్నాయి. గుడివాకలంక, కోమటిలంక గ్రామాలకు రాకపోకలు పునరుద్ధరణ కాలేదు. గుడివాకలంక, ప్రత్తికోళ్లలంక, కొక్కిరాయిలంక, పైడిచింతపాడు గ్రామాల ప్రజలు చెట్టున్నపాడు, ఆగడాలలంక, గుండుగొలను మీదుగా చుట్టుతిరిగి ఏలూరుకు రాకపోకలు సాగిస్తున్నారు. కొల్లేరులో చేపల వేట నిలిపివేయడంతో మత్స్యకారుల పరిస్థితి దయనీయంగా మారింది. కొల్లేరు గ్రామాల్లోని చేపల చెరువుల్లోకి వరద చేరడంతో ఆక్వా రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పెదపాడు-కుదరవల్లి ఆర్‌అండ్‌బి రహదారిపై పలుచోట్ల వరద ప్రవహిస్తుండటంతో అధికారులు రాకపోకలను నిలిపివేశారు.

కాలువ తవ్వాలి

కొసనం ఏసుబాబు, కడిమికుంట, పెదపాడు మండలం

మా మండలంలో పది రోజులుగా 300 ఎకరాలు నీటిలోనే ఉంది. 70 రోజుల్లో రెండుసార్లు పురుగు మందులు వేశాం. ఎకరానికి రూ.25 వేల వరకు పెట్టుబడి పెట్టాం. పంట చేతికొచ్చే సమయంలో మొత్తం నీళ్ల పాలైంది. మా ప్రాంతంలో ఆరు కిలోమీటర్ల మేర కాలువ తవ్వితే గ్రామంతోపాటు పొలాలను సైతం ముంపు బారి నుంచి తప్పించొచ్చు. దీనిపై గత అయిదేళ్లలో స్పందన కార్యక్రమంలో అనేక ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదు. నేను ఎనిమిది ఎకరాలు కౌలుకు తీసుకుని ఊడ్చితే మొత్తం నీట మునిగింది.

ఏచూరి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

ఆయన మృతి తీరని లోటు


పలుచోట్ల సంతాప సభలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి పట్ల సిపిఎం ఏలూరు జిల్లా కమిటీ తీవ్ర సంతాపం ప్రకటించింది. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపింది. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి గురువారం ప్రకటన విడుదల చేశారు. సీతారాం ఏచూరి 1952 ఆగష్టు 12న మద్రాసులో స్థిరపడిన తెలుగు కుటుంబంలో జన్మించారని, 1974లో ఎస్‌ఎఫ్‌ఐలో సభ్యుడిగా తన రాజకీయ ప్రస్థానం ప్రారంభమైందని తెలిపారు. 1985లో సిపిఎం కేంద్ర కమిటీలో, 1988లో కేంద్ర కార్యవర్గంలో, 1999లో పొలిట్ బ్యూరోలో చోటు దక్కిందన్నారు. 2005లో బెంగాల్ నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారని తెలిపారు. విశాఖపట్టణంలో జరిగిన సిపిఎం మహాసభల్లో పార్టీ ఐదో ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారని తెలిపారు. ఆయన గత కొన్ని రోజులుగా శ్వాసకోస అనారోగ్యంతో ఇబ్బందిపడుతూ ఆసుపత్రిలో వైద్యం చేయించుకుంటున్నారని, పరిస్థితి విషమించి గురువారం మధ్యాహ్నం కన్నుమూశారని తెలిపారు. ఆయన మృతి సిపిఎంకు తీరని లోటన్నారు. ఆయన మృతికి సంతాపాన్ని తెలియచేస్తూ ఏచూరిని స్ఫూర్తిగా తీసుకొని సిపిఎం నాయకులు, కార్యకర్తలు పార్టీలో పని చేయడమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళులని రవి తెలిపారు. సంతాప సూచికంగా ఈ వార్త తెలిసిన వెంటనే పార్టీ జిల్లా కార్యాలయంపై ఉన్న జెండాను కిందకు దింపారు.


నూజివీడులో...

స్థానిక సిపిఎం కార్యాలయంలో నగర కార్యదర్శి పి.కిషోర్ అధ్యక్షతన సంతాప సభ నిర్వహించారు. సీతారాం చిత్రపటానికి ప్రభుత్వాసుపత్రి మాజీ సూపరింటెండెంట్, ప్రముఖ సంఘ సేవకులు డాక్టర్ రావి గోపాలకృష్ణయ్య పూలమాలవేసి నివాళులర్పించారు.



ఏలూరు సిపిఎం కార్యాలయంలో...

అనంతరం పార్టీ కార్యకర్తలు, నాయకులు ఏచూరి చిత్రపటానికి పూలను చల్లి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడారు. సీతారాం ఏచూరి మృతి, సిపిఎం ఉద్యమానికే కాకుండా భారత దేశ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడానికి, దోపిడీకి వ్యతిరేకంగా జరిగే అన్ని పోరాటాలకు తీరని లోటన్నారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ సీతారాం ఏచూరి నిబద్ధత కలిగిన నాయకుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.లింగరాజు, ఎం.నాగమణి, జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

కామవరపుకోట : సీతారాం ఏచూరి మృతి పట్ల సిపిఐ కామవరపుకోట మండల కార్యదర్శి టివిఎస్.రాజు, సహాయ కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఆయన సేవలను కొనియాడారు. ప్రజానాట్యమండలి సీని యర్ బుర్రకథ కళాకారులు సబ్బి కనకారావు, ఎపి జానపద కళాకా రుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్‌ఆర్.కృష్ణబాబు, ప్రజా గాయకుడు కంకిపాటి ఏసుపాదం, సిపిఐ మండల కార్యదర్శి వర్గ సభ్యులు గుద్దేటి సత్యనారాయణ, చలమాల శ్రీనివాసరావు సంతాపం తెలిపారు.

నూజివీడు టౌన్ : సీతారాం ఏచూరి మృతికి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రాజు, నూజివీడు పట్టణ కార్యదర్శి ఎన్ఆర్ హనుమాన్లు, నాయకులు శోభనాద్రి మరియదాస్, వీరన్న, నాని, వసంతరావు, పద్మాంజలి, సరస్వతి సంతాపం తెలిపారు.

ముసునూరు : స్థానిక బస్టాండ్ సెంటర్‌లో సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోడవలి శ్రీనివాస్, కొల్లి శ్రీనివాసరావు, కంచర్ల రమేష్, కంచర్ల దుర్గారావు, కంచర్ల సత్యం, కంచర్ల శ్రీను, సిహెచ్.శ్రీను, పిల్లి మురళీ, పిల్లి సుధీర్, గంగుల సత్యం, కుటుంబరావు, ఆనందరావు పాల్గొన్నారు.

నిడమర్రు : సిపిఎం, ప్రజాసంఘాల జెండాలను నిడమర్రు, భువనపల్లిలో కిందకు దించారు. సిపిఎం నిడమర్రు మండల కన్వీనర్ నారపల్లి రమణారావు మాట్లాడుతూ సీతారాం ఏచూరి మృతి దేశంలో వామపక్షలకు, కార్మిక ఉద్యమానికి తీరని లోటన్నారు. సీతారాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో కోన శ్రీనివాసరావు, గవర సత్యనారాయణ, వెలగలేటి మోహన, కానూరు రాజు, సంకు నాగశ్రీను, పుల్లూరి చంటి పాల్గొన్నారు.

కుక్కునూరు : సీతారాం ఏచూరి మృతి బాధాకరమని సిపిఎం మండల కార్యదర్శి యర్రంశెట్టి నాగేంద్రరావు, సిఐటియు మండల కార్యదర్శి సాయి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మృతి తీరని లోటన్నారు.


నిడమర్రులో...

సిపిఐ సంతాపం

ఏలూరు అర్బన్ : సీతారాం ఏచూరి మృతి వామపక్ష ఉద్యమానికి తీరని లోటని సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు పుప్పాల కన్నబాబు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావు గురువారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. ఏచూరి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

కాంగ్రెస్ సంతాపం

ఏలూరు అర్బన్ : సీతారాం ఏచూరి మృతి పట్ల కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన జాతీయ భావాలు గల విశిష్ట వ్యక్తి అని, ఆయన పోరాటాలు భారతదేశ ప్రజాస్వామ్యంలోనే గొప్పవని, ఇలాంటి రాజకీయ నాయకులు చాలా అరుదుగా ఉంటారని ఆయన పేర్కొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

రైతుసంఘం ఆధ్వర్యంలో ధర్నా


ధర్నా చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - నిడమర్రు

నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతూ భువనపల్లి, అడవికొలను గ్రామాల్లో సచివాలయాల వద్ద ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో గురువారం ధర్నాలు నిర్వహించారు. పాపోలు రాంబాబు అధ్యక్షతన జరిగిన ధర్నాల్లో ఎపి రైతుసంఘం జిల్లా కమిటీ సభ్యులు కోన శ్రీనివాసరావు మాట్లాడుతూ వర్షాలు, వరదల నాట్లు వేసిన పొలాలు పూర్తిగా మునిగి నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.20 వేలు పరిహారం అందించాలని కోరారు. కౌలు రైతులకు యజమానితో సంబంధం లేకుండా గుర్తింపు కార్డులిచ్చి ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అడవికొలను సచివాలయంలో విఆర్‌ఒ సాయిగోపాల్‌కు, భువనపల్లి సచివాలయంలో విఆర్‌ఒ గీతావాణికి వినతిపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం మండల కార్యదర్శి లావటి సోంబాబు, వెలగలేటి మోహన, కానూరు రాజు, వ్యవసాయ కార్మికసంఘం నాయకులు గవర సత్యనారాయణ. అందే పుల్లయ్య. దొరబాబు, కె.సింహాచలం, జె.రామకృష్ణ నాయకత్వం వహించారు.

14న జాతీయ లోక్ అదాలత్

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తమకుమార్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా మూడో జాతీయ లోక్ అదాలత్‌ను సెప్టెంబరు 14న నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమకుమార్ తెలిపారు. గురువారం స్థానిక జిల్లా కోర్టులో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమకుమార్ పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ ఈ నెల 14న జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించడానికి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా 4,543 కేసులను రాజీయోగ్యమైనవిగా గుర్తించినట్లు చెప్పారు. ఈ కేసుల పరిష్కార నిమిత్తం జిల్లావ్యాప్తంగా 33 లోక్ అదాలత్ బెంచీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దూర ప్రాంతాల్లో ఉండి రాజీ చేసుకోదలచినవారు ఆన్‌లైన్ ద్వారా కేసులు పరిష్కరించుకోవచ్చని తెలిపారు. దీనికి సంబంధించిన ప్రతి కోర్టుల్లో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ముందస్తు మధ్యవర్తిత్వం ద్వారా 72 కేసులను రాజీ చేసినట్లు తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో రాజీయోగ్యమైన అన్ని క్రిమినల్ కేసులు, సివిల్ తగాదాలు, యాక్సిడెంట్ కేసులు, చిట్ ఫండ్, కుటుంబ వివాదాలు, టెలిఫోన్, బ్యాంకు కేసులను రాజీ చేసుకోవచ్చన్నారు. గత లోక్ అదాలత్‌లో 1538 పెండింగ్ కేసులను రాజీ చేయడం ద్వారా రాష్ట్రంలో జిల్లా ఐదో స్థానంలో ఉందని, ఈ జాతీయ లోక్ అదాలత్‌లో కూడా మరిన్ని కేసులు పరిష్కరించడానికి న్యాయవాదులు, కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవల్సిందిగా తెలిపారు. ఈ సమావేశంలో పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్ పర్సన్ ఎ.మేరీగ్రేస్ కుమారి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్, ఆంధ్రప్రదేశ్ బార్ అసోషియేషన్ సభ్యులు బివి.కృష్ణారెడ్డి, ఏలూరు బార్ అసోషియేషన్ అధ్యక్షులు కోనే సీతారాం ఉన్నారు.

విద్యాభ్యాసానికి వైకల్యం ఆటంకం కాకూడదు

సినీ హీరో ఆర్యన్ గౌరా

వికలాంగులకు కృత్రిమ కాళ్లు అందజేత

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

విద్యాభ్యాసానికి వైకల్యం ఆటంకం కాకూడదని, పుట్టుకతో గాని, ప్రమాదవశాత్తు గాని శరీర అవయవాలు పోగొట్టుకుని వికలాంగులు అయినవారు కృత్రిమ అవయవాలను అమర్చుకోవడం ద్వారా స్వశక్తిని సాధించి, విద్యను కొనసాగించి, ఉన్నత స్థితికి ఎదగాలని సినీ హీరో ఆర్యన్ గౌరా(మై సాధియో ఫేమ్) అన్నారు. మండలంలోని తోటపల్లి కృత్రిమ అవయవ కేంద్రంలో ప్రముఖ సంఘ సేవకులు బోగిరెడ్డి ప్రియాంక, డాక్టర్ కాకరాల నాగబిందుశ్రీ (అమెరికా), సినీ హీరో ఆర్యన్ గౌరా అందించిన ఆర్థిక సాయంతో పలు జిల్లాలకు చెందిన ఐదుగురు వికలాంగులకు కృత్రిమ కాళ్లను అందించారు. ఈ కార్యక్రమంలో హీల్ సిఇఒ కె.అజయ్‌కుమార్, ప్రొఫెసర్ డాక్టర్ పిఎల్‌ఎన్.రాజు, వల్లూరి రాజ్యలక్ష్మి, అరవపల్లి సుగుణ, గౌరా జ్యోతి కుమారి,స్ి నీయర్ టెక్నిషియన్ చిన్నా, కృత్రిమ అవయవకేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.



హీరో ఆర్యన్ గౌరాతో కృత్రిమ కాళ్లు అందుకున్నవారు

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఏలూరు :ఏలూరు ఒకటో పట్టణంలోని కోటదిబ్బ సబ్‌స్టేషన్, వెంకన్నట్యాంక్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్లలో మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు నిమిత్తం ఈ నెల 13వ తేదీ శుక్రవారం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎపిఇపిడిసిఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జెపిబి.నటరాజన్ తెలిపారు. ఈ సమయంలో ఒకటో పట్టణ పరిధిలోని కొత్తగూడెం సెంటర్, ఏడు కాలవుల సెంటర్, చాటపర్రు రోడ్, తూర్పు వీధి సాయి బాబా ఆలయం సెంటర్, తూర్పు వీధి గంగానమ్మ ఆలయం ఏరియా, ఫిల్ హౌస్ పేట, వివర్స్ కాలనీ, పోణంగి రోడ్డు, చిరంజీవి బస్టాండ్ సెంటర్, దక్షిణపు వీధి, కుండీసెంటర్, గడియార స్తంభం ఏరియా, కాతేపూ వీధి, తూర్పు వీధి, న్యూ మార్కెట్ ఏరియా, బెనర్జీ పేట, వెన్నవల్లివారిపేట, సత్యనారాయణపేట, లంబాడీ పేట, అగ్రహారం, మెయిన్ బజార్, కెనాల్‌రోడ్డు పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

ఏజెన్సీలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి


ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ఏజెన్సీ గ్రామాల్లో విషజ్వరాలు రాకుండా హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించి ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. సిపిఎం మండల కమిటీ సమావేశం మండల కార్యదర్శి వర్గ సభ్యులు ఉడతా వెంకటేష్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కార్యదర్శి రవి మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ఏజెన్సీలో విష జ్వరాలు పెరుగుతున్నాయన్నారు. ఐటిడిఎ పరిధిలో అనేక మారుమూల గ్రామాల్లో నేటికీ సరైన వైద్యం అందక అనేకమంది గిరిజనులు మృత్యువాత పడుతున్నారన్నారు. గిరిజనుల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం, అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని నాణ్యమైన వైద్యం అందించాలన్నారు. గిరిజన వైద్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి ఏజెన్సీ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఐటిడిఎ ప్రధాన రహదారిపై ఉన్న కల్వర్టులను ఎత్తుగా నిర్మించాలని సిపిఎం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ డిమాండ్ చేశారు. కొండవాగులపై కల్వర్టులతో పాటు పట్టెన్నపాలెం వద్ద ఉన్న జల్లేరు వాగుపై బ్రిడ్జి నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మొడియం నాగమణి, జిల్లా కమిటీ సభ్యులు తామ ముత్యాలమ్మ, అందుగుల ఫ్రాన్సిస్, మండల నాయకులు పోలోజు నాగేశ్వరరావు, చుండ్రు బుల్లెమ్మ, కారం భాస్కర్, తెల్లం వెంకటలక్ష్మి, వెట్టి వీరయ్య కొవ్వాసు దుర్గారావు పాల్గొన్నారు.

గుండెపోటుతో విశ్రాంత ఎంఇఒ మృతి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

విశ్రాంత మండల విద్యాశాఖాధికారి, విజయవాడ రాయల్‌క్లబ్ సభ్యులు, ఆగిరిపల్లి కాపు సంఘ ప్రముఖులు పోతుకూరు సాంబశివరావు(67) బుధవారం సాయంత్రం విజయవాడ రమేష్ హాస్పిటల్‌లో గుండెపోటుతో చనిపోయారు. ఆయనకు భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి, ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.



సాంబశివరావు (ఫైల్)

నేరాలు - ఘోరాలు



వివరాలు తెలుపుతున్న ఎస్‌పి ప్రతాప్‌శివకిశోర్

నిందితులు ఎంతటివారైనా పట్టుకుంటాం

ఎస్‌పి ప్రతాప్‌శివకిశోర్

8 కేసుల్లో నలుగురు అరెస్టు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

నిందితులు ఎంతటివారైనా అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో వారి ఆట కట్టించేందుకు పోలీసు శాఖ సిద్ధంగా ఉందని, నిందితులను పట్టించేందుకు ప్రజలు సైతం తమ సహకారాన్ని పోలీసు శాఖకు అందించాలని ఎస్‌పి ప్రతాప్‌శివకిశోర్ అన్నారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి పలు కేసులకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. పెదపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో నాలుగు, నూజివీడు పోలీస్ స్టేషన్ పరిధిలో మూడు దొంగతనాల కేసులు నమోదయ్యాయన్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో వాహన తనిఖీలు చేస్తున్న సమయంలో విజయవాడ ప్రాంతానికి చెందిన పేకేటి వెంకటరెడ్డి, నూజివీడు ప్రాంతానికి చెందిన చేకూరి వెంకటరెడ్డి, విజయవాడ కొత్తపేట ప్రాంతానికి చెందిన షేక్ అల్లా బక్షులు వారు దొంగిలించిన బంగారాన్ని అమ్మేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులకు తారసపడ్డారు. వెంటనే పోలీసులు వారిని అరెస్టు చేశారు. నగరంలోని ఒకటో పట్టణ పరిధిలో కొన్ని రోజుల క్రితం మహిళ మెడలో గొలుసు చోరీ జరిగింది. బాధిత మహిళ ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టగా మాదేపల్లి ప్రాంతానికి చెందిన చింతపల్లి సూర్యకుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి బంగారు గొలుసు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం ఎనిమిది కేసుల్లో ఏలూరు, పెదపాడు, నూజివీడు పోలీసులు సంయుక్తంగా నలుగురు నిందితులను అరెస్టు చేశారు. ఈ మొత్తం కేసుల్లో 115 గ్రాముల బంగారు ఆభరణాలు, నాలుగు కేజీల 756 గ్రాముల వెండి వస్తువులు, రెండు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్‌పి తెలిపారు. వీటి విలువ రూ.13.28 లక్షలు ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ప్రజలందరూ దుకాణ సముదాయాలు ఉన్న ప్రాంతాల్లో, జనసంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో, అపార్ట్‌మెంట్లలో, నేరాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉన్న ప్రాంతాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కేసులను ఛేదించేందుకు పూర్తిస్థాయిలో సహకరించిన ఏలూరు సిసిఎస్ ఎస్‌ఐ మురళీకృష్ణ, గణపవరం సిఐ సుభాష్, పెదవేగి సిఐ సత్తి, పెదపాడు ఎస్ఐ శుభశేఖర్, టౌన్ ఎస్ఐ మదీన బాషా, సిసిఎస్ ఎస్ఐ చంద్రశేఖర్, సిబ్బందిని ఎస్‌పి అభినందించారు. వారికి రివార్డులను కూడా ప్రకటిస్తామని తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - టి.నర్సాపురం

ఆర్థిక ఇబ్బందులను భరించలేక యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల కేంద్రమైన టి.నర్సాపురం పరిధిలోని ఎర్రదొరువు కాలనీలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పరసా ఏసు కుమారుడు అనిల్ (26) గురువారం ఉదయం 6.30 గంటల సమయంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడని బంధువులు గమనించగా అప్పటికే చనిపోయినట్లు వారు గుర్తించారు. ఆర్థిక ఇబ్బందులతో ఉరి వేసుకున్నాడని అతని భార్య ధనలక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వ్యక్తిపై దాడి కేసులో నిందితుడికి జైలు, జరిమానా

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

వ్యక్తిపై దాడి కేసులో నిందితుడికి మూడేళ్ల 15 రోజులు సాధారణ జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. వివరాల ప్రకారం... నగరంలోని ఒకటో పట్టణ పరిధిలో నివాసం ఉంటున్న యు.నాగేంద్ర భార్య పిల్లలతో కలిసి జీవిస్తున్నాడు. ఏలూరు సత్యనారాయణపేటకు చెందిన లీలారాజు తరచూ నాగేంద్రతో సన్నిహితంగా ఉండేవాడు. నాగేంద్ర భార్యతో అతనికి పరిచయం ఏర్పడి ఆమెతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. దీంతో లీలారాజును నాగేంద్ర ఈ విషయం గురించి అడగగా కోపానికి గురైన లీలారాజు నాగేంద్రపై కత్తితో దాడి చేయడంతో చెయ్యి విరిగింది. దీనిపై 2022లో నాగేంద్ర ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. హెడ్ కానిస్టేబుల్ రాధాకృష్ణ కేసు నమోదు చేశారు. ఈ కేసును అప్పటి ఎస్ఐ రామకృష్ణ ఛార్జ్ షీటు దాఖలు చేశారు. దీనిపై వాదోపవాదాలు విన్న న్యాయమూర్తి వాసుదేవ్ గురువారం పూర్వాపరాలు పరిశీలించి లీలారాజును నిందితుడిగా గుర్తించి మూడేళ్ల 15 రోజుల సాధారణ జైలు శిక్ష, రూ.6,500 జరిమానా విధించారు. ఈ కేసులో సాక్షులను ప్రవేశపెట్టి నిందితుడికి శిక్షపడేలా చేసిన ఒకటో పట్టణ సిఐ సత్యనారాయణ, ఎస్ఐ మదీనా బాషా, కోర్టు కానిస్టేబుల్ సత్యనారాయణలను ఏలూరు డిఎస్‌పి శ్రావణ్‌కుమార్ అభినందించారు.

తెలంగాణ మద్యం పట్టివేత

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని తాటియాకులగూడెం సరిహద్దు తనిఖీ కేంద్రం వద్ద గురువారం సాయంత్రం ఎస్ఐ వి.నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేస్తుండగా తెలంగాణ రాష్ట్రం నుండి ఆంధ్రాకు తరలిస్తున్న 15 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. మద్యాన్ని సీజ్ చేసి ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కూలీలను ఆదుకోవాలి : వ్యకాస

ప్రజాశక్తి - కుక్కునూరు

కుక్కునూరు మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి వ్యవసాయ కార్మికులకు జీవన భృతి కల్పించి ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం కుక్కునూరు మండల కార్యదర్శి కురకుల బాబూరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానికంగా గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారీ వర్షాలు, వరదల కారణంగా మండలంలో సాగు, పనులు లేక పూట గడవని పరిస్థితిలో వ్యవసాయ కార్మికుల కుటుంబాలు ఉన్నాయన్నారు. కార్మిక కుటుంబాలకు బియ్యంతో పాటు నిత్యావసర వస్తువులను ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా వరద బాధితులకు నష్టపరిహారం తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని సిఐటియు నూజివీడు ప్రధాన కార్యదర్శి జి.రాజు డిమాండ్ చేశారు. గత ఐదు నెలల నుంచి జీతాలు రాక శానిటేషన్ కార్మికులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించి పిఎఫ్, ఇఎస్ఐ వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు.

నేడు మండల స్థాయి ఆటల పోటీలు

ప్రజాశక్తి - ముసునూరు

ఏలూరు జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు స్కూల్ గేమ్స్ సెక్రటరీ షెడ్యూల్ ప్రకారం 13, 14 తేదీల్లో మండల స్థాయి ఆటల పోటీలు ముసునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్ ఎ.సునీల్‌రెడ్డి తెలిపారు. జనవరి ఒకటో తేదీ 2008, జనవరి ఒకటో తేదీ 2011 సంవత్సరం మధ్య జన్మించిన విద్యార్థులకు అండర్ బి14, అండర్ 17 విభాగాల్లో ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

బస్ పాస్ మంజూరు కేంద్రాన్ని గ్రౌండ్ ఫ్లోర్‌కు మార్చాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

వికలాంగుల బస్సు పాస్ మంజూరు, రెన్యువల్స్ సెంటర్‌ను ఆర్‌టిసి డిఎం ఆఫీసులో పై అంతస్తు నుంచి కింది గ్రౌండ్ ఫ్లోర్‌కి మార్చాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డి) ఏలూరు జిల్లా కమిటీ కోరింది. ఈ మేరకు ఎన్‌పిఆర్‌డి జిల్లా గౌరవ అధ్యక్షులు బి.సోమయ్య, అధ్యక్షులు కుందేటి జయరాజు, ఏలూరు మండలాధ్యక్షులు పల్లెం వెంకటేశ్వరరావు గురువారం ఆర్‌టిసి డిపో మేనేజర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ప్రస్తుతం వికలాంగుల బస్సుపాసుల మంజూరు కేంద్రం ఆర్‌టిసి డిఎం ఆఫీస్‌లో మొదటి అంతస్తులో ఉందని, దీంతో మొదటి అంతస్తుకు చేరుకోవడానికి ఇనుప మెట్లు ఎక్కాల్సి ఉందని, ఆ మెట్లు ప్రమాదకరంగా ఉన్నాయని, వాటి వల్ల వికలాంగులు అనేక ఇబ్బందులు పడుతున్నార చెప్పారు. అంధులు, శారీరక వికలాంగులు మొదటి అంతస్తు ఎక్కలేక బస్సు పాసులు మంజూరు, రెన్యూవల్స్ చేయించుకోలేకపోతున్నారని తెలిపారు. ఆర్‌టిసి అధికారులు వికలాంగుల బస్సు పాస్ మంజూరు కేంద్రాన్ని కింద గ్రౌండ్ ఫ్లోర్‌కి మార్చాలని వారు కోరారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల గ్రామానికి చెందిన యన్నంశెట్టి శ్రీను (కాడ శ్రీను) ఇటీవల మృతి చెందాడు. ఆయన కుటుంబాన్ని గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు ఎంఎస్‌ఆర్ ట్రస్ట్ అధినేత మొగతడకల శ్రీనివాసరావు, మొగతడకల ఓం ప్రకాష్ గురువారం పరామర్శించారు. కుటుంబ ఆర్థిక అవసరాల నిమిత్తం రూ.పది వేలు ఆర్థిక సాయం అందించారు.

ఎస్ఐను కలిసిన మండల సర్పంచులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

చేబ్రోలు ఎస్‌ఐగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన సూర్యభగవాన్‌ను ఉంగుటూరు మండల సర్పంచులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామాల్లో గణేష్ ఉత్సవాల నేపథ్యంలో శాంతి భద్రతలపై వివరించారు. ఛాంబర్ అధ్యక్షుడు పుత్సకాయల విష్ణుమూర్తి, సర్పంచులు కంభంపాటి సత్యవతి సూరిబాబు, మిద్దె సత్యవతి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

యువత చెడు మార్గాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - ఉంగుటూరు


నారాయణపురం అరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థులకు (దీక్షా రంభ్) ఇండక్షన్ కార్యక్రమంలో భాగంగా కళాశాల ఐక్యు అకాడమిక్ సెల్ ఆధ్వర్యంలో అవగాహనా సదస్సు నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన అధ్యాపకుడు డి.రెడ్డయ్య మాట్లాడుతూ కళాశాలలో నూతనంగా చేరిన విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించి చదువుతో పాటు సమాజాభివృద్ధికి పాటు పడే విద్యార్థులుగా తయారు చేయడం ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు. డాక్టర్ కొండా రవి మాట్లాడుతూ కళాశాల విద్యలో స్టూడెంట్ సపోర్ట్ సర్వీసెస్ గురించి తెలియజేసి, యాంటీ ర్యాగింగ్ సెల్, గ్రీవెన్స్ రెడ్రిస్సెల్ సెల్, జాతీయ సేవా పథకం మొదలైన విభాగాల పనితీరులను, విద్యార్థులు వాటిని ఎలా వినియోగించుకోవాలో వివరించారు. ముఖ్య వక్త సీనియర్ అడ్వకేట్ న్యాయ సేవ విభాగం సభ్యులు కూన కృష్ణారావు, లేళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం ద్వారా ఈ మధ్యకాలంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అందులో విజేతలైన విద్యార్థులకు విలువైన పుస్తకాలు, మెరిట్ సర్టిఫికెట్ అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కెమిస్ట్రీ అధ్యాపకులు జిహెచ్.శివ, కామర్స్ అధ్యాపకులు రామ్మోహన్‌రావు, రాజనీతి శాస్త్రవేత్తగా దీపకులు ఫణీంద్ర, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రశాంసపత్రాలతో విజేతలు

వివేక్‌కు ట్రిపుల్ ఐటీలో సీటు

డిఇఒ అభినందన



వివేక్‌ను అభినందిస్తున్న డిఇఒ అబ్రహం

ప్రజాశక్తి - ఏలూరు

ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన స్థానిక జనరేషన్ హైస్కూల్ విద్యార్థి ఎ.వివేక్‌రాజ్‌ను జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం అభినందించారు. స్పోర్ట్స్ కోటాలో ఆ విజయం సాధించినందుకు అభినందించి పలు సూచనలు చేశారు. తాను కూడా ఒక ఫుట్ బాల్ ఆటగాడినని, ఆటలు ఆరోగ్యానికే కాకుండా ఇలాంటి విజయాలకు చాలా దోహదపడతాయన్నారు. పాఠశాల సంచాలకులు ఎస్‌ఆర్‌కెవి.ప్రసాద్‌ను అభినందించారు. వివేక్ నిరుపేద కుటుంబం అయినప్పటికీ చిన్ననాటి నుంచి చదువులో, ఆటల్లో ముందుండేవాడు. పదో తరగతిలో 2023-24 విద్యాసంవత్సరంలో 518 మార్కులు సాధించడమే కాకుండా జాతీయ స్థాయిలో ఫుట్ బాల్ ఆటగాడిగా ఎన్నో పతకాలు సాధించినట్లు ఆపుస్మా గేమ్స్ అండ్ స్పోర్ట్స్‌లో స్పోర్ట్స్ కేటగిరిలో ఛాంపియన్ షిప్ రావడానికి ఎంతో కృషి చేసిన విషయాన్ని ప్రసాద్ తెలిపారు.

ఫ్యూచర్ ఇండియా అకాడమీ సభ్యులకు అభినందన

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు పాత బస్టాండ్ సమీపంలోని ఫ్యూచర్ ఇండియా అకాడమీ సభ్యులు ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటిని ఆయన క్యాంపు కార్యాలయంలో గురువాం మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా అకాడమీ ఛైర్మన్ సతీష్ సావిత్రి సరెళ్ల మాట్లాడుతూ ఢిల్లీ, హైదరాబాద్ నగరాల్లో లభించే యుపిఎస్‌సి కోచింగ్‌ను తక్కువ ఖర్చుతో మొట్ట మొదటి సారిగా ఏలూరు నగరంలో అదిస్తున్నామని చెప్పారు. ఈ కోచింగ్ కోసం ఢిల్లీ నుంచి అత్యుత్తమ ప్రతిభ ఉన్న ఫ్యాకల్టీనీ ఏలూరు తీసుకొస్తున్నామన్నారు. ప్రస్తుతం 25 రాష్ట్రాల నుంచి విద్యార్థులు కోచింగ్ తీసుకుంటున్నారన్నారు. ఎంఎల్ఎ చంటి మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల నుంచి విద్యార్థులు, ఫ్యాకల్టీనీ ఏలూరు నగరానికి తెప్పించి ఏలూరు ప్రతిష్ఠను మన దేశం మొత్తం చాటి చెప్పిన ఫ్యూచర్ ఇండియా అకాడమీ సభ్యులు అభినందనీయులన్నారు. ఢిల్లీ నుండి వచ్చిన ఫ్యాకల్టీ ముకేష్ సహాయే మాట్లాడుతూ దేశానికి వంద మంది ఐఎఎస్‌లను అకాడమీ నుంచి అందించాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్న సతీష్‌ని అభినందించారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించాలి

ప్రజాశక్తి - చింతలపూడి

బాగా చదివే విద్యార్థులకు ఉన్నత విద్య అభ్యసించేందుకు ప్రోత్సాహకాలు అందించాల్సిన అవసరం ఉందని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. ఏలూరులో జిల్లా పరిషత్ స్థాయి సంఘం సమావేశంలో ఆయన పాల్గొన్నట్లు తెలిపారు. జిల్లా పరిషత్ స్థాయి సంఘం సమావేశంలో సాంఘిక సంక్షేమ పాఠశాలల ముఖ్య అధికారులు జెడ్‌పి సిఇఒ సుబ్బారావు, డిసిఒలతో ఆయన మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థులందరికీ మెరిట్ బెస్‌లో అవకాశం కల్పించేలా కృషి చేయాలన్నారు. విద్యా ప్రమణాలు మెరుగుపర్చాలని, నాణ్యమైన భోజనం, వసతి కల్పించాలని, విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి కల్పించాలన్నారు. విద్యార్థులు ఎక్కువగా ఉన్నప్పుడు ప్రత్యేక సెక్షన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. బాలికల హాస్టల్ ప్రాంగణంలో భద్రత దృష్ట్యా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉందని తెలిపారు.

దరఖాస్తుల స్వీకరణ

బుట్టాయగూడెం : బుట్టాయగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న మ్యాథ్స్ అధ్యాపక గెస్ట్ ఫ్యాకల్టీగా పని చేయడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ సంజీవని కుసుమ తెలిపారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత పొందినవారు అర్హులని, సెప్టెంబర్ 14వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని, సెప్టెంబర్ 25వ తేదీన ఉదయం పది గంటలకు ఇంటర్వ్యూ ఉంటుందని తెలిపారు.

విజయవాడ వరద బాధితులకు సాయం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

విజయవాడ వరద బాధితులు 500 మందికి టిడిపి సుంకొల్లు గ్రామ నాయకులు ఐదు కేజీల బియ్యం బ్యాగులు, వెయ్యి. దుప్పట్లు, వెయ్యి టవల్స్ అందించారు. రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి పిలుపుతో నూజివీడు పార్టీ కార్యాలయం నుంచి విజయవాడ నగరంలో వరద బాధితులకు పంపిణీ నిమిత్తం పంపించారు.

ముదినేపల్లి : విజయవాడ వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిధికి పలువురు గురువారం విరాళాలు అందించారు. మండలంలోని పెయ్యేరు గ్రామానికి చెందిన హనుమర పేర్నీడు (పెదబాబు) రూ.2 లక్షల చెక్కును ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్‌కు అందించారు. మండలంలోని ఈడేపల్లికి చెందిన అభిశెట్టి నాగబాబు (ఎఎన్.బాబు) రూ.25 వేలు, బొమ్మినంపాడుకు చెందిన భాష్యం కిషోర్ రూ.పది వేలు అందించారు.

ముదినేపల్లి : ముదినేపల్లి మండల పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరద బాధితులకు గురువారం దుప్పట్లు, నిత్యాసర వస్తువులు పంపిణీ చేశారు. కృష్ణాజిల్లా నందివాడ మండలం పుట్టగుంట గ్రామంలో భారీ వర్షాలు, వరదల వల్ల ఇళ్లు మునిగిపోయిన కుటుంబాలకు దుప్పట్లు, బ్రెడ్, నిత్యావసర వస్తువులను పాస్టర్లు అందించారు. ఈ కార్యక్రమంలో ఉచ్చుల సర్జన్‌రాజు, పుట్టా పేతురు, ప్రసన్నరాజు, విజయకుమార్, మండల పాస్టర్లు పాల్గొన్నారు.

ఆకు కూరలతోనే ఆరోగ్యం

పలుచోట్ల పౌష్టికాహార మహోత్సవం

ప్రజాశక్తి - ముదినేపల్లి

పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా పోషకాహారంపై ముఖ్యంగా ఆకు కూరలపై ప్రతిఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ చూపాలని గురజ పిహెచ్‌సి హెల్త్ ఎడ్యుకేటర్ జోనాతన్ అన్నారు. ఐసిడిఎస్ కైకలూరు ప్రాజెక్టు పరిధిలోని ముదినేపల్లి మండల పరిధిలోని చేవూరుపాలెం గ్రామంలో గురువారం పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా రక్తహీనత గురించి అంగన్వాడీ కార్యకర్తలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలు తీసుకోవాల్సిన పోషకాలు, ఆకుకూరల ప్రాముఖ్యత గురించి వివరించారు. వీటిని తీసుకుంటే రక్తహీనత ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సిహెచ్.ప్రసూన, శ్రీహరిపురం ఎంఎల్‌పి హెచ్ జ్యోత్స, సింగరాయపాలెం ఎఎన్ఎం సౌజన్య, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలవరం :అంగన్వాడీల ఆధ్వర్యంలో పౌష్టికాహార వారోత్సవాల సందర్భంగా పోలవరం పంచాయతీ బిసి కాలనీ అంగన్వాడీ కేంద్రంలో గురువారం గర్భిణులకు, శిశువులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి సిడిపిఒ రాణి మాట్లాడుతూ పౌష్టికాహార వారోత్సవాల సందర్భంగా నలుగురు గర్భిణులకు సీమంతం, శిశువులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. గర్భిణులు, బాలింతలు, శిశువులు అంగన్వాడీల ద్వారా సరఫరా అయ్యే పౌష్టికాహారాల సౌకర్యాలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు సుంకర అమ్మాజీ, గుత్తుల విజయలక్ష్మి, కొండకుమారి ఇతర అంగన్వాడీల కార్యకర్తలు ఆయాలు, మహిళలు, శిశువులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : మంగపతిదేవిపేటలో పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ నయోమీరాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తల్లులకు పౌష్టికాహారం గురించి వివరించారు. ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచి హాజరయ్యారు. సీమంతం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు భవాని, ధనలక్ష్మి, శాలిని, నాగరత్నం పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : నూజివీడు అర్బన్ బాబునగర్ అంగన్వాడీ కేంద్రం-2లో పోషణ మాహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ నూరాని మాట్లాడుతూ గర్భిణులకు, బాలింతలకు, కిశోర బాలికలకు తృణధాన్యాలను ఆహారంలో అందించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనివ్వగలుగుతుందని చెప్పారు. హెల్త్ సూపర్‌వైజర్ కుమారి మాట్లాడుతూ స్థానికంగా తక్కువ ఖర్చుతో దొరికే ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు తీసుకోవడం వల్ల శరీరానికి సమతుల్య ఆహారం అంది ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. సిడిపిఒ వ్యక్తిగత పరిశుభ్రత పోషకాహారం పట్ల అవగాహన కల్పించారు. కిశోర బాలికలకు, గర్భిణులకు పరీక్షలు చేయించారు. కిశోర బాలికలకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. అన్నప్రసన కార్యక్రమం నిర్వహించారు.

బుట్టాయగూడెం : పౌష్టికాహారం మాహోత్సవం కార్యక్రమంలో భాగంగా బుట్టాయగూడెంలో బుధవారం పోషకాహార ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా సూపర్ వైజర్ ఝాన్సి మాట్లాడుతూ గర్భిణులకు, బాలింతలకు, తల్లులకు తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు కలిగిన ఆహారం తయారు చేసుకోవడం గురించి, అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే న్యూట్రిషన్ కిట్స్, గుడ్లు, పాలు, బాలామృతం, బియ్యం, పప్పునూనెలతో రక రకాలు వంటకాలు తయారు చేసే పద్ధతుల గురించి వివరించారు.

డాక్యుమెంట్స్ పోయినవి

వంగపండు శ్రీనివాసరావు అను నేను పూళ్ళ గ్రామంలో డోర్ నెం: 3-181లో నివసిస్తున్నాను. నేను పూళ్ళ నుండి భీమడోలు వెళ్ళుతుండగా దారి మధ్యలో ఒరిజినల్ దస్తావేజు పత్రములు పడిపోయినవి. దస్తావేజు నెంబర్స్: 6210/2020, 3120/2021. ది. 04-09-2024 న పోయినవి. ఎవరికైనా దొరికినచో ఈ క్రింది అడ్రస్‌కు సంప్రదించగలరు.

వంగపండు శ్రీనివాసరావు
S/o. అప్పారావు
పూళ్ళ గ్రామం
భీమడోలు మండలం, ఏలూరు జిల్లా
సెల్: 77022 88088

<u>వేలం ప్రకటన</u>

మహారాజశ్రీ నర్సాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

<u>E.P. No. 10 of 2020</u> in <u>O.S. No. 100 of 2016</u>

<u>Between:</u>

పిటీషనర్/ డి. హెచ్. ఆర్: కోళ్ళ సూర్యనారాయణ
మరియు
రెస్పాండెంటు/ జె. డి. ఆర్: ధనాని నాగమణి

పై నెంబరు ఇ.పి.లో పిటీషనర్/ డి. హెచ్. ఆర్‌కు రావల్సిన ఇ.పి. బాకీ వసూలు నిమిత్తం రెస్పాండెంటు/ జె.డి.ఆర్.కు చెందిన యీ క్రింది షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని **ది. 27-09-2024వ తేదీ ఉదయం గం॥ 10.30 ని॥ల** లగాయితూ పై కోర్టు వారి ఆవరణలో సదరు షెడ్యూలు ఆస్తిని పాలకొల్లు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, మెయిన్ బ్రాంచిలోని తనఖాకు లోబడి శ్రీ కోర్టు వారు వేలం వేయుదురు. కావున ఆసక్తి ఉన్నవారు సదరు వేలం పాటలో పాల్గొని పాడుకొనవచ్చును.

<u>షెడ్యూలు ఆస్తి వివరం:</u>

ప॥గో॥జిల్లా, పాలకొల్లు సబ్ రిజిస్ట్రారులో చేరిన ఉల్లంపర్రు గ్రామపంచాయతీ ఏరియాలో ఉల్లంపర్రు గ్రామం తాలూకు జిరాయితీ పల్లం రి.స. నెం. 21రులోని ప్లాట్ నెం. 22లో పడమర వైపు 81-0-0 చ॥గ॥ స్థలం అందులోని ఇ.నెం. 4-248 రు ఆర్.సి.సి. డాబా యిల్లుకు హద్దులు.

తూర్పు: ఇంజేటి వెంకటేశ్వరరావు ఇల్లు స్థలం. **దక్షిణం:** దాసరి ముత్యాలమ్మ స్థలం. **ఉత్తరం:** రోడ్డు. **పడమర:** రోడ్డు.

ఈ హద్దుల మధ్య ఆర్.సి.సి. బాబా యిల్లు స్థలం ఈజుమెంటు హక్కులు సహా.

<u>డి. హెచ్. ఆర్. విలువ: రూ. 5,00,000/-లు</u>
<u>అమీనా విలువ: రూ. 15,00,000/-లు</u>
<u>సబ్ రిజిస్ట్రార్ విలువ: రూ. 14,90,000/-లు</u>

నర్సాపురం **జక్కంశెట్టి వెంకటేశ్వరరావు**
ది.12-09-2024 అడ్వకేటు, నర్సాపురం

IN THE COURT OF THE HON'BLE VI JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, AT HYDERABAD O.S.NO. 869 OF 2024

Between:
Union Bank of India, (erstwhile Andhra Bank merged in UBI) Credit Card Division, Koti, Hyderabad, represented by the Manager
..Plaintiff
And
Sri Eswartrinath Kumar Seelamanthula @SET Kumar, S/o. Sri Seelamanthula Kalidasu, aged about 31 years, Occ: Carpenter, R/o.H.No.2-162, Main Road, Ramalayam Street, K Kannapuran, West Godavari, Andhra Pradesh-534311
...Defendant

The plaintiff filed the above numbered suit against you, for recovery of Rs.1,28,577.25Ps. (Rupees One Lakh Twenty Eight Thousand Five Hundred Seventy Seven and Twenty Five Paise only)with subsequent interest @ 2.95% per month compounded monthly and service charges from date of suit till realisation and costs and the same stands posted to 25-09-2024 for your appearance in person or through duly appointed Advocate at 10-30A.M and if you fail to so appear, the matter will be decided on merits, in your absence.

(BY ORDER OF THE COURT)
Sd/- (S.VIKRAMADITYA BABU)
Counsel for the Plaintiff
H.No.16-11-16/T/5, West Prasanthnagar Colony, Moosarambagh, Hyderabad-500 036

ఈసీ పాస్‌పోర్టు పడిపోయింది

పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలం ఆచంట వేమవరం గ్రామానికి చెందిన చెల్లుబోయిన రాముడు తండ్రి : వెంకన్న అను నా యొక్క ఒరిజినల్ ఈసీ పాస్‌పోర్ట్ పడిపోయింది. ఈసీ పాస్‌పోర్ట్ నెంబర్ : X0961194 ది.08 - 08-2024వ తేదిన ఆచంట వేమవరం నుండి ఆచంట మోటార్ సైకిల్ పై వెళ్తుండగా ఈసీ పాస్‌పోర్ట్ పడిపోయినది. ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్ కు తెలియజేయగలరు.

చెల్లుబోయిన రాముడు
తండ్రి వెంకన్న (డోర్ నెం : 4 - 166/ఎ)
ఆచంట వేమవరం, ఆచంట మండలం
ప.గో.జిల్లా. సెల్ : 9177798829

In the Court of the VII Addl. District Judge - Cum - Family Court, Eluru, W.G.District
<u>E.A. No. /2024</u> in
<u>E.P. No. 125/2021</u>
in <u>ARC No. 117/2015</u>

<u>Between:</u>
M/s. Shriram City Union Finance Ltd., Chintalapudi ***...Petitioner/ DHr***
AND
Smt. M.Subadhra and Others
...Respondents/ JDrs

<u>JDrs:</u>
Muggulla Madhavi, D/o. Lakshmi Narayana, Hindu, Female, aged 25 years, D.No. 5-21, Main Road, Yarraguntapalli, Chintalapudi Mandal, W.G.District.

యిందు పై గ్రంధములో మీ యొక్క హాజరు నిమిత్తం **ది. 27-09-2024వ తేదీకి వాయిదా అయి వున్నది. ఆరోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట వ్యక్తిగతంగా గాని, మీ లాయరు గారి ద్వారా గాని హాజరు అయిన మీ యొక్క అభ్యంతరములు తెలియ చేసుకొనవలయును. లేనిచో మీ పరోక్షమున తీర్మానము చేయబడునని యిందుమూలముగా తెలియచేయడమైనది.

K.V.S.N.R.GOPAL
12-09-24 Advocate, Eluru

మహారాజశ్రీ నర్సాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్ వారి కోర్టులో
<u>Debtor IP No.10/2021</u>

Between:
పిటిషనర్ : గురుజు వరప్రసాద్, S/o.శివయ్య, డోర్ నెం.1-66, శివ దేవుని చిక్కాల గ్రామం పాలకొల్లు మండలం, ప.గో.జిల్లా.
Vs
రెస్పాండెంట్లు: R1.బొరుసు వెంకటేశ్వరరావు, మేడపాడు గ్రామం, యలమంచిలి మండలం, ప.గో.జిల్లా.
R2.ఇంటి శ్రీరామ్ @ అబ్బాయి గారు, తిల్లపూడిపాలెం, పాలకొల్లు మండలం, ప.గో.జిల్లా,
R7.నీలం తాతాజీ, తిల్లపూడి, పాలకొల్లు మండలం, ప.గో.జిల్లా.
R8.పనతుల రామాంజనేయులు, S/o. వెంకటేశ్వర రావు, పోలమూరు గ్రామం, పాలకొల్లు మండలం.
R10.జంపన చైతన్య వర్మ, శివ దేవుని చిక్కాల గ్రామం, పాలకొల్లు మండలం, ప.గో.జిల్లా.
R11. ఆర్.సూరిబాబు, మెంటివారి తోట, భీనువరం, ప.గో.జిల్లా.
R13. కొప్పర్తి సాయి రామ్. S/o.శ్రీరామమూర్తి, శంకరమఠం, భీమవరం ప.గో.జిల్లా
R14. నడపన శేషు, S/o.వెంకటేశ్వరరావు తిల్లపూడి, పాలకొల్లు మండలం, ప.గో.జిల్లా.
R16. వేలిది అమ్మి రాజు, S/o.మాసేను శివ దేవుని చిక్కాల గ్రామం, పాలకొల్లు మండలం, ప.గో.జిల్లా.
R17. గంధం చందు, S/o.హరిబాబు, వీరవాసరం గ్రామం, వీరవాసరం మండలం, ప.గో.జిల్లా

పై నెంబరు గ్రంథంలో మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపినను మీరు తీసుకోకుండా కాలయాపన చేసినందున ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది. కాబట్టి ది.17-09-2024న ఉ గం. 10:30 ని.లకు మీరు వ్యక్తిగతంగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని మీ వాదన తెలియజేయవలసిందిగా కోరుచున్నాను. లేనిచో పై పిటిషను మీ పరోక్షమున తీర్మానించబడును.

వాయిదా :17-9-2024

డి. సుబ్రహ్మణ్యం, అడ్వకేట్, పాలకొల్లు
సెల్: 98491 73674

<u>వేలం ప్రకటన</u>

మహారాజశ్రీ నర్సాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

<u>E.P. 36/2019</u> in <u>O.S. 314/2014</u>

<u>Between:</u>

<u>DHR:</u> వద్ది వెంకట ఆనందరావు
Vs
<u>JDR:</u> కొపనాతి నాగరాజు అనే నారాయణస్వామి

<u>షెడ్యూలు</u>

పశ్చిమగోదావరి జిల్లా, మొగల్తూరు మండలం, మొగల్తూరు సబు రిజిస్ట్రారులో చేరిన కొత్తోట గ్రామపంచాయతీ ఏరియాలోని ముత్యాలపల్లి రెవిన్యూ గ్రామం తాలూకు

<u>1వ ప్రతి:</u> జిరాయితీ మెరక కొబ్బరితోట ఆర్.ఎస్. నెం. 62/3డి రు పూరా య. 4-02ట్లులో య.0-37 ట్లుకు హద్దులు.

తూర్పు: కొపనాతి నారాయణస్వామి వగైరాల భూమి. **దక్షిణం:** ఉప్పుతేరు మార్జిన్ అడవి భూమి. **పడమర:** మైలపోతు రాజు గారి భూమి. **ఉత్తరం:** కొల్లాటి వెంకటేశ్వర్లు గారి భూమి.

యీ హద్దుల మధ్య య. 0-37ట్లు భూమి వివిధ ఫలవృక్షములు సహా.

<u>2వ ప్రతి:</u> జిరాయితీ మెరక ఆర్.ఎస్. నెం. 60/7ఎ రు పూరా య. 0-44ట్లులో య. 0-13ట్లుకు హద్దులు.

తూర్పు: రేవు సత్యవతి గారి భూమి. **దక్షిణం:** కొపనాతి పద్మారావు గారి భూమి. **పడమర:** దండుబోయిన బేబి గారి భూమి. **ఉత్తరం:** రోడ్డు మార్జిన్ భూమి.

యీ హద్దుల మధ్య య. 0-13ట్లు భూమి, యిందులోని నానావిధ ఫలవృక్షములు సహా.

పై షెడ్యూలు దాఖలా ఆస్తిని DHR యొక్క బాకీ వసూలు నిమిత్తం పై కోర్టు వారు **ది. 3-10-2024 సం॥ తేదీని ఉదయం 10.30 ని॥** లగాయితూ కోర్టులో వేలంలో విక్రయించుదురు. కాబట్టి సదరు వేలంలో పాడుకొనుటకు కోర్టు వారు యీ పేపరు ప్రకటన ద్వారా తెలియచేయుచున్నారు. యిందు మూలముగా యావన్మందికి వేలములో పాల్గొనగలందులకు కోరడమైనది.

1వ అయిటం:
*<u>**DHR వాల్యూ : రూ.3,70,000/-లు**</u>*
*<u>**అమీనా వాల్యూ: రూ. 9,50,000/-లు**</u>*
2వ అయిటం:
*<u>**DHR వాల్యూ : రూ.1,30,000/-లు**</u>*
*<u>**అమీనా వాల్యూ: రూ. 39,00,000/-లు**</u>*

(By Order of Court)

గునిశెట్టి శ్రీనివాసరావు
నర్సాపురం DHR తరపు అడ్వకేటు
11-9-24 నర్సాపురం, సెల్: 9553126234